# పారిపోకు తమ్ముడూ!

అవధానుల విజయలక్ష్మి



క్రిందటిరోజు ఫెళ్ళున కాచిన ఎండకి బాకీ తీర్చేసుకొన్నట్లు భోరున కురుస్తోంది వర్షం: సెకండ్‌క్లాస్ అద్దాల తలుపులన్నీ ఎప్పుడో మూసుకొన్నాయి. పెద్దపెద్ద చినుకులు ఒకదానివెనకే ఒకటి వచ్చి టప్‌టప్‌మని కిటికీఅద్దాల్ని కొట్టుకొని పాములా మెలికలు తిరుగుతూ జారిపోతున్నాయ్. చెమ్మబారిన అద్దాల వెనక మంచి మసక మసగ్గా కనపడుతోంది కదిలిపోయే ప్రపంచం. దూరంగా సగం నల్లటి మేఘాలతో కప్పబడి ఉన్న నీలి కొండ వర్షానికి ఒణికిపోతూ నిండా చీర చెంగు కప్పుకొని కూర్చొన్న అందమైన ఆడపిల్లలా ఉంది.

సీటుమీద విశ్రాంతిగా వెనక్కివాలి కూర్చొన్నాడు పాతికేళ్ళ రవి. జేబులోంచి సిగరెట్ తీసి వెలిగించాడు. అగ్గిపుల్లని ఉఫ్‌మని ఊది కంపార్ట్‌మెంటంతా కలియజూశాడు. ఓ పదిహేనుమంది కంటే ఎక్కువ లేరు: కదిలిపోయే ట్రెయిన్లో

ఎవరి ప్రపంచంలో వాళ్ళున్నారు. రవి పెదవులమీద సన్నని చిరునవ్వు మొలిచింది. ఈ సిగరెట్టే ఇంట్లో తాగాలంటే ఎంత అవస్థ! ఎంత ప్రయాస! ఇంట్లోంచి ఏదోవంక కల్పించుకొని బయటికెళ్ళాలి! అక్కడ కూడా ఎవరూ చూడకుండా భయంగా.... బితుగ్గా.... స్వేచ్ఛలేని జీవితం!

అసలు దేనికుందని స్వేచ్ఛ? రొటీన్.. రొటీన్.... లేవడం.., పళ్ళుతోమడం.... కాఫీ తాగడం.... ఆఫీస్‌కెళ్ళడం.... ఆఫీస్ నించి రావడం.... అన్నం తినడం...మళ్లీ పడుకోడం .... మళ్ళా లేవడం.... రోజులో ఇరవైనాలుగ్గంటలూ...గంటలో అరవై నిమిషాలూ..... నిమిషంలో అరవై సెకండ్లూ.... రొటీన్! ముక్కుకి తాడు కట్టి ఎద్దుని యజమాని నడిపించినట్లు నడవడం!

ఆ ఇంట్లో....ఆ పరిసరాల్లో ఉన్నంత వరకు ఆ జీవితం తప్పదు! ఎన్నాళ్ళిలా? భవిష్యత్తులోకి చూస్తే చివరినిమిషందాక ఇలాగే గడుస్తుందేమో అనిపిస్తోంది.... పెళ్ళా మొస్తుంది.... మరి కొన్నాళ్ళకి పిల్లలు పుడతారు.... వాళ్ళు పెద్దవాళ్ళవుతారు....మరి కొన్నాళ్ళకి వాళ్ళకి పిల్లలు పుడతారు.... ఇప్పటికే ఇరుగ్గా ఉన్న జీవితం ఇంకా ఇరుకై పోతుంది! కనీసం విశ్రాంతిగా కాలుజాపుకొనే జాగా కూడా ఉండదు!

రవి విసురుగా తల విదిలించాడు. అతివేగంగా వెళ్తున్న ట్రెయిన్లో కూర్చొని కూడా ఈ ఆలోచనేమిటి? ఈనాటినుండి తాను స్వేచ్ఛాజీవి! ఇష్ట మొచ్చినప్పుడు పడుకోడం .... ఇష్ట మొచ్చినప్పుడు లేవడం.... అన్నం తినాల నున్నప్పుడు తినడం.... మానేయాలను కొన్నప్పుడు మానేయడం.... వండర్ ఫుల్! ఇంకొకళ్ళ కోపాలకి తాపాలకీ, కన్నీళ్ళకీ, ప్రేమకీ తాను కట్టుబడి ఉండక్కర్లేదు! ఆ బంధాల తాళ్ళని తెంచేసుకొని కొత్త ప్రపంచంలోకి అడుగు పెట్టబోయే స్వేచ్ఛాజీవి తను!

కంపార్ట్‌మెంటంతా కలియజూసి జేబులోంచి నోట్లని తీసి లెక్కపెట్టాడు. టిక్కెట్టు డబ్బులు పోను పన్నెండు వందలు మిగిలాయి! ఈ నెల జీతం ప్లస్ బోనస్!

విజయవాడ చేరగానే చవకరకంవే ఓ జత బట్టలు, అవసరమైన కొన్ని సామాన్లూ కొనుక్కోవాలి. ఆఫీస్‌లోంచే తిన్నగా వచ్చేశాడు. కట్టుబట్టలు తప్ప ఏమీలేవు! బట్టలకీ వాటికీ ఎలాలేదన్నా రెండువందలు పోతాయి.

మిగతా వెయ్యిరూపాయల్తో ఎన్నాళ్ళు గడపొచ్చు? మామూలు లాడ్జిలో దిగినా రోజుకి పది....బస్సులకీ రిక్షాలకు, సినిమాలకీ మరో పది! భోజనాలకీ టిఫిన్లకీ మరో పది! రోజుకి ముప్ఫయి రూపాయల చొప్పున రమారమి నెల్లాళ్ళు సరిపోతాయి.

తర్వాత?....తర్వాత?.... రవి కిటికీకి

తల అన్చి కళ్ళు మూసుకొన్నాడు. అతని మనస్సులో దృశ్యం!.... 'జోరు గా హుషారుగా....' అని పాడేసుకొంటూ రిక్షా తొక్కేస్తున్నాడు.... కష్టపడి చెమ టోడ్చి డబ్బులు సంపాదించేస్తున్నాడు. ఇంకొకరి క్రింద పనిచెయ్యకుండా స్వేచ్ఛగా సంపాదించిన డబ్బులు! సగం డబ్బులు డబ్బాలోవేసి సగం ఖర్చుపెట్టు కొంటున్నాడు. కొన్నాళ్ళకి డబ్బా నిండి పోయింది. ఆ డబ్బుతో ఓ స్వంత రిక్షా... కాదు కాదు....ఓ కిళ్ళీకొట్టు. ఓ చిన్న దుకాణమయింది! ఆ దుకాణం కొన్నా ళ్ళకి హోటలు.... ఆ హోటల్ పెద్ద ఫైవ్‌స్టార్ హోటల్! రిక్షా హేండిల్ పట్టుకొన్న చేతులే కారు స్టీరింగ్‌వీల్‌ని పట్టుకొని నడుపుతూ.... ఫైన్!

ధనాధన్ మన్న చప్పుడుతో ట్రెయిను బ్రిడ్జిమీదనుండి వెళుతోంది. ఉలిక్కిపడి కళ్ళు తెరిచాడు రవి. మనస్సులోని అందాలదృశ్యం చెదిరిపోయింది హాయిగా ఫానుకింద కూర్చొని పనిచేసే తను ఎండలో రిక్షా తొక్కగలడా! ఒకవేళ తొక్కినా అందులో డబ్బు మిగల్చ గలడా? మళ్ళీ కళ్ళు మూసుకొన్నాడు.... మనస్సు తెరమీద మరో దృశ్యం!

జేబులో ఉన్న వెయ్యిరూపాయల్తో.. హాయిగా ఇరవై రోజులు గడిపేశాడు. స్వేచ్ఛగా....హాయిగా....ప్రపంచంలోని సుఖాలన్నిటిని అనుభవించేసి...అప్పుడు.. అప్పుడు ఆఖరి పదిరూపాయల కాగితంతో ఓ డాక్టరు దగ్గరకెళ్ళి.... సరిగ్గా నిద్ర పట్టడంలేదని నిద్రమాత్రలకి ప్రిస్క్రిప్షన్ రాయించేసుకుని... నాలుగైదుకొట్లు తిరిగి.... ఓ ఇరవై నిద్రమాత్రలు సంపాదించి.... ఇరవై రోజుల తర్వాత ఈ ఊర్నించే కాదు.... ఈ ప్రపంచం నుంచే శాశ్వతంగా స్వేచ్ఛగా, హాయిగా... ఏ బంధాలూ.... ఏ బాధ్యతలూ లేని చోటుకి....

వర్షపు ధారల్ని చీల్చుకొని అతి వేగంగా రైలు పట్టాలమీంచి పరుగెడు తూనే ఉంది....

• • •

వానజల్లుకి తడిసిన పంచె అంచుల్ని చేత్తో పిండుకొంటూ లోపలి కడుగు పెట్టారు రఘురామయ్యగారు.

"టెలిగ్రాం ఇచ్చారా?" పొడితువ్వా లందిస్తూ అడిగింది పార్వతమ్మ.

"ఇచ్చాను....రేపొద్దున్నకల్లా పెద్దాడు వచ్చేస్తాడు. ఇద్దరం రేపు జనతాలో బయల్దేరతాం" అన్నారు నీరసంగా కుర్చీలో కూలబడుతూ.

మౌనంగా లోపలికి నడిచింది పార్వ తమ్మ.

బుర్రంతా తడిసి చల్లగా అయి పోయినా బుర్రలోపుల మంటపెట్టినట్లు వేడిగా ఉంది రఘురామయ్యగారికి.

ఎందుకిలా జరుగుతోంది? వీడిలా పారిపోడం ఇది మొదటిసారీ కాదు రెండోసారీ కాదు.... ఇంటర్లో ఫస్ట్‌క్లా

సొచ్చిందని ఊరంత ఆశతో మెడిసన్‌లో చేర్పిస్తే ఇష్టంలేని చదువు చదివిస్తున్నారంటూ మొదటిసారి .'పోనీ నీ కిష్టమైనదే చదవరా' అని బియ్యేలో జాయిన్‌చేస్తే ఆ విద్యావిధానం నచ్చలేదంటూ రెండో సారి.... ఎలాగోలా బియ్యే ప్యాసయ్యేటుగా కట్టించి ఉద్యోగంలో చేర్పిస్తే అసహ్యకరమైన ఆఫీసు వాతావరణం అంటూ ఈసారి....ఓ చీటీ పెట్టేయడం.... పారిపోడం....

ఎందుకు అస్తమానం ఇలా ఇల్లొదిలి పారిపోడం?.... ఇది మనిషిలో సహజంగా ఉండే ఎస్కేపిజమా? లేక తాము పెంపకంలో చేసిన లోటా? అయినా తా నే లోటుచేశాడు? వాడు ఎలా కావాలంటే అలాగే చేశాడే! అయినా సరే ప్రతి సారీ అందరూ కలపి నన్ను బంధించేస్తున్నారని నింద వేస్తాడు!

చిన్నప్పటినించి తా నెన్ని కష్టాలు పడ్డాడు! ఓ వైపు ఇంటిబాధ్యతలు మోస్తూ....ఓ వైపు చదువుకొంటూ....ఓ వైపు ఉద్యోగంచేస్తూ .... ఎన్నిసార్లు తనకి ఈ బాధ్యతల్నుంచి....బాధల్నించి తప్పించుకు పోదామనిపించలేదు! కాని తా నెప్పుడూ అలా చెయ్యలేదే! కాని అన్నీ రెడీమేడ్‌గా అమర్చిపెడితే .... వీడెందుకిలా చేస్తూఉంటాడు?

ఆలోచిస్తున్నకొద్దీ రఘురామయ్యగారి బుర్ర వేడెక్కిపోతోంది. ఇక వాడిని ఎలా వెతికిపట్టుకోవాలో...ఎక్కడెక్కడ తిరగాలో.... వచ్చిన తర్వాత మళ్ళా ఏమేమి బోధించాలో — సమస్యలు! సమస్యలు!

క్రిందటిసారి పారిపోయి తిరిగివచ్చేసిన తర్వాత రెండురోజులు కూర్చోపెట్టి చెప్పారు "నువ్వు ఊర్లొంచి పారిపోయి సమస్యల్నుంచి పారిపోతున్నాననుకోడం తెలివితక్కువ! నువ్వెక్కడికి కెళ్ళినా నీ మనస్సు నీతోనే ఉంటుంది.... నీ మనస్సు నీతో ఉన్నతంతవరకు నువ్వెక్కడికెళ్ళినా ఈ సమస్యలూ బంధాలూ నీ వెనకే వస్తాయి. అందువల్ల ముందు నీ మనస్సుని స్వేచ్ఛగా ఉంచుకో.... తర్వాత పారిపోయే విషయం ఆలోచించు!

చెప్పినంత సేపూ తలూపి మళ్ళా ఆఫీసులో చిన్న సమస్య ఎదురవగానే పారిపోయాడు! ఆలోచించే ఓపిక తగ్గిపోయింది ఆయనకి. ప్రస్తుతం ఈ సమస్యనించి తాత్కాలికంగా తనను బయటపడేయగలిగినది భగవద్గీత ఒక్కటే!

నెమ్మదిగా కుర్చీలోంచి లేచి గూట్లోని భగవద్గీత అందుకొన్నారు. నిన్న సగం చదువుతూ గుర్తుగా పెట్టిన పేజీతీసి పడక్కుర్చీలో వెనక్కివాలారు

సంస్కృత శ్లోకాలూ.... దాని కింది సామవేదుల సీతారామశాస్త్రిగారి ముత్యాల సరాలూ.... దానికింద తెలుగులో వ్యాఖ్యానం.

శ్లో॥ సర్వ ధర్మాన్ పరిత్యజ్య
మమేకం శరణం వ్రజ

అహంత్వాం సర్వ పాపేభ్యాం
మోక్షయిష్యామి మాశుచః 18-66
సకల ధర్మాలు విడిచి నన్నే
శరణు పొందుము; దిగులు చెందకు;
పాపముల నన్నిటి నుండియు
నిన్ను నే రక్షింతును.

('పాపము' అన్నదానికి 'తాను చెయ్యవలసిన పని చేయలేకపోతున్నానేమో అనే మనోక్లేశము' లేక 'తాను ఆచరించవలసిన ధర్మం ఆచరించలేకపోతున్నానేమో అనే మనోక్లేశము' అని గూడ అర్థము చెప్పుకోవచ్చును.)

శ్లోకాల తర్వాత శ్లోకాలు....

పేజీల తర్వాత పేజీలు...

మనస్సు ప్రశాంతంగా అయింది.... కళ్ళు మూతలుపడ్డాయి.

* * *

పెరటి గుమ్మంలో కూర్చొని బియ్యం ఏరుతోంది పార్వతమ్మ.

"ఈ పాటికి ఏం చేస్తున్నాడో పిచ్చి నాగన్న! లంచవర్లో ఇంటికి వస్తూనే వీధిలోంచే ఇవాళ ఏంకూర చేశావమ్మా అని కేకేసుకొంటూ వచ్చేవాడు." రెండు కన్నీటిబొట్లు రాలి చేటలో పడ్డాయి.

"నువ్వెందుకంత అవస్థ పడతావ్? శుభ్రంగా మంచి హోటల్లో హాయిగా భోంచేస్తూ ఉంటాడు-" అని ఆయన అంటారు. కాని ఆయనకేం తెలుసు తల్లి బాధ!

మొన్నటికి మొన్న 'అమ్మా రేపు పచ్చికారం పెట్టి వంకాయకూర చెయ్యవే' .... అన్నాడు... పిచ్చివెధవ... నోరారా అడిగాడు కదాని ఆవేళ చేసిపెడితే లంచవర్లో ఇంటికి రానేలేదు. ఆవేళ సాయంత్రమూ రాలేదు. సాయంత్రం వెళ్ళి కనుక్కుంటే ఆవేళ ఆఫీస్నించి మధ్యాహ్నమే వెళ్ళిపోయాడని తెలిసింది! వాడికోసం ఎంతో బాగా చేసిన కూరంతా తీసి కెళ్ళి చెత్తకుండీలో పారేసింది! పార్వతమ్మకి దుఃఖం ఆగలేదు. చేట పక్కన పడేసి వెక్కెక్కి ఏడ్చింది. మనస్సులో వున్న దుఃఖం అంతా బయటకుపోగానే మనస్సు ప్రశాంతంగా అయింది.

"ఛీఛీ! తానిలా బెంగపెట్టేసుకో కూడదు! తానిలా బెంగపెట్టేసుకొని తీరా వాడు తిరిగొచ్చేసరికి మంచమెక్కితే...? ఒద్దొద్దు" పార్వతమ్మ గబగబా కళ్ళు తుడిచేసుకొంది

ఏమైనా పన్లు కల్పించుకోవాలి.... ఊపిరి తిరగని పన్లలో పడితే తాను దిగులు మర్చిపోతుంది .... తాను పన్లలోనే పుట్టింది.... పనిచేస్తూనే పెరిగింది.... పన్లలోనే తన మెదడుకి రెస్టు .... గబగబా వంటింట్లోకి నడిచింది....

* * *

చేతిలోని టెలిగ్రాం మరోసారి చూసుకొన్నాడు శేఖర్.

"రవి పారిపోయాడు. వెంటనే రా. వెతకాలి."




చదువుతున్నకొద్దీ అతని మనస్సులో చికాకు మరింత ఎక్కువౌతోంది.

"ఛీఛీ! రోజురోజుకి ఇలా తయారౌతున్నాడేమిటి వీడు? అయినా నాన్నగారు మరీనూ.... చేతిలో డబ్బులు అయిపోయాక వాడే తిరిగివస్తాడు! దాని గురించి మళ్ళా ఎందుకింత శ్రమ.... డబ్బుఖర్చు! అలవాటయిన భాగోతమే కదా ఇది! ఆత్మహత్య చేసేసుకుంటాననో.... శాశ్వతంగా తిరిగిరాననో ఉత్తరంపెట్టి పారిపోడం.... నాన్నా, తనూ ఇద్దరం రెండు ఊర్లకి వెళ్ళడం .... లాడ్జీలంట తిరగడం.... వాడు కనబడకపోవడం.... ఇద్దరం ఇంటికి తిరిగివచ్చేసరికి వాడు అప్పటికే ఇంట్లో ఉండడం.... వాడినేం అనకండని అమ్మ కన్నీళ్ళు.... ఇంట్లో ఈ సమస్య ఎప్పుడు అఖరవుతుందో" చేతిలోని ఉత్తరాన్ని

గ్రౌంని ఉండచుట్టి విసిరికొట్టాడు. గదిలో విసురుగా పచార్లుచేస్తూ ఆలో చిస్తున్నాడు.

ఈసారి తమ్ముడు తిరిగొచ్చాక తన దగ్గరికి తెచ్చేసుకోవాలి.... అసలు వాడి ఉద్దేశమేమిటో.... ఏం చెయ్యదలచు కున్నాడో నెమ్మదిగా రాబట్టాలి.... నాన్నగారు వాడికి బోలెడు వేదాంతం బోధిస్తూ ఉంటారు.... ఇప్పుడు కావలసి నది వేదాంతమేనా?.... వాడిక్కావలసి నవి బోధనలు కావు.... జీవితంలో ఒక లక్ష్యం! ఈసారి వాడిని చీవాట్లేయ టం కాకుండా ఏ ఫీల్డులో ఆసక్తుందో నెమ్మదిగా రాబట్టాలి.... ఒకవేళ ఎందు లోనూ లేకపోతే క్రియేట్ చెయ్యాలి.... అంతే! అదే ఈ సమస్యకి పరిష్కారం...

శేఖర్ పచార్లుచెయ్యడం ఆపేసి కిటికీ దగ్గరకెళ్ళి నిల్చొన్నాడు.

"ఎస్కేపిజం!" శేఖర్ పెదవుల మీద చిన్న చిరునవ్వు మొలిచింది చేదుగా.

తనకి మాత్రం ఎన్నిసార్లనిపించ లేదు! ఈ పరిసరాల్లోంచి ఎస్కేపయి పోవాలని! ఈ ఉద్యోగం రాకముందు .... ఈ ఊరికి రాకముందు.... ఎంత హాయిగా చీకూచింతా లేకుండా ఉండే వాడు! పగలల్లా స్నేహితులతో కబుర్లు .... ఎన్నో విషయాలమీద చర్చలు.... సాయంత్రమయ్యేసరికి చెరువుగట్టుకో, ఊరవతలున్న కొండమీదకో షికారు.... ప్రకృతిలో అందాలన్నీ మనస్సులో ముద్రించుకొని ఇంటికొచ్చి కాన్వాసు బిగించి పెయింట్ చేస్తూ కూర్చొంటే.... అర్ధరాత్రయినా అలసట తెలిసేది కాదు. ఏదో జయించానన్న గర్వం.... ఏదో సాధించానన్న తృప్తి.... ఇప్పుడు ఏమయ్యాయి ఆ గర్వం.... ఆ తృప్తి? ఇప్పుడు.... ఈ బొగ్గుగనిలో చేరిన తర్వాత.... స్నేహితుల్లేరు.... చర్చ ల్లేవు.... పొద్దున్నే గనిలో దిగితే సాయంత్రమే ఆ చీకటి గుహల్లోంచి బయటకు రావడం.... ఇంటికొచ్చి స్నానంచేసి విశ్రాంతిగా వీధి వరండాలో కూర్చొంటే కనిపించేదేంటి? చుట్టూ బొగ్గుకుప్పలు!

కొండలూ గుట్టలూ లేవు.... పచ్చని చెట్లూ లేవు... మైదానాల్లేవు... ఎక్కడి కెళ్ళినా బొగ్గు.... నల్లటి బొగ్గు.... నల్లటి మనుష్యులు.... నల్లటి రోడ్లు... ఎన్నిసార్లనిపించలేదు ఈ సౌందర్య రాహిత్యంలోంచి పారిపోవాలని!.... కాని పారిపోలేడు! ఇంకోచోట ఉద్యో గమూ దొరకదు తను చదివిన ఈ ప్రత్యేకమైన ఈ చదువుకి.... శేఖర్ కిటికీకి తల ఆన్చి కూర్చొన్నాడు. రేపొద్దున్న దక్షిణ్‌లో బయల్దేరి నాన్న గారి దగ్గరికెళ్ళాలి.... అక్కడినుండి ఒకరు కాజీపేటకి, ఒకరు విజయవాడకీ .... వెళ్ళాలి.

పోన్లే వారంరోజులపాటు రిలీఫ్!

ట్రెయిన్‌లో వెనక్కి పరిగెడుతున్న ప్రకృతి దృశ్యాలు.... కాజీపేట గుట్ట మీంచి చూస్తే కనబడే అందాలు.... వడ్డేపల్లి చెరువులో చెట్ల నీడలు... ఇంకా ఎన్నో.... ఎన్నెన్నో.... మొదట హృదయం మీద.... తర్వాత స్కెచ్ బుక్‌లోను వేసుకోవాలి.... మళ్ళీ ఇక్కడికొచ్చాక కొన్నాళ్ళపాటు ఈ బొగ్గు ప్రపంచాన్ని మర్చిపోయి హాయిగా పెయింటింగ్స్ వేసుకొంటూ కాలం గడపొచ్చు!

శేఖర్ మనస్సులో చికాకు ఒక్కసారిగా ఎగిరిపోయి ఉత్సాహం చోటు చేసుకొంది. టపటపా నాలుగు వర్షం చినుకులు కిటికీలోంచి వచ్చి మొహానికి కొట్టుకొన్నాయి. కిటికీ తలుపు ముయ్యబోతూ ఒక్క క్షణం బయటకు చూశాడు. జోరున పడబోయే వర్షానికి నాందిగా మబ్బులు పట్టిన ఆకాశం.... క్రమక్రమంగా పెద్దదవుతున్న వర్షంలోంచి నెత్తిమీద తట్టలో బొగ్గులు పెట్టుకొని వడివడిగా నడిచిపోతున్న కొందరు స్త్రీలు.... ఎందుకో ఇవాళ బొగ్గుల్లో కూడా అందం కనబడుతోంది! కొన్నాళ్ళపాటు వీటికి దూరంగా ఉంటానన్న భావనవల్లనా? శేఖర్ హుషారుగా లోపలికి నడిచి కాన్వాసుని ఫ్రేముకి బిగించాడు. గూట్లోవున్న బ్రష్‌లూ రంగులూ తీశాడు.

రెండు గంటల్లో పూర్తయిన చిత్రం చూసుకొన్నాక శేఖర్ పెదవులమీద విజయగర్వంతో కూడిన చిరునవ్వు మొలిచింది. అందమైన అమ్మాయి నెత్తి మీద తట్ట పెట్టుకొని నడుస్తోంది.... ఆమె మొహంలో జీవకళ.... పెదవుల మీద కనీకనిపించని చిరునవ్వు.... కళ్ళలో అలసట....

ఫెంటాస్టిక్! జీవితంలో ఇంత తృప్తిగా ఎప్పుడూ బొమ్మ వెయ్యలేదు. ఆ బొమ్మనే చూస్తూ.... రేపటి కార్యక్రమం గూర్చి తాత్కాలికంగా మర్చిపోయి కుర్చీలో వాలాడు శేఖర్.

* * *

స్టవ్ మీద ఉప్మాని పరధ్యానంగా కలుపుతూ ఆలోచిస్తోంది పద్మ. ఈ రోజైనా ఈయన త్వరగా వస్తారో రారో? అప్పుడే నాలుగు రోజుల్నుంచి అనుకొంటున్న ప్రోగ్రాం టాంక్‌బండ్ మీదికి షికారుకెళ్ళాలని! రోజూ ఏదో ఆటంకం.... రెండు బస్సులు మారి ఆయన ఇంటికొస్తారు ఎంతో అలిసిపోయిన ఆ మొహం చూడగానే తిరగడానికెళ్దామన్న మాట నోట్లోనే ఉండిపోతుంది. ఆయన హుషారుగా ఇంటికొచ్చిన రోజు పనులు తెమలవు. అన్నీ సవ్యంగా అయినరోజు బుజ్జిగాడు గుక్కపట్టి ఏడుస్తాడు. ఎన్నాళ్ళయింది అలా సాయంత్రం పూరు బయటికి తిరిగొచ్చి? బుజ్జిగాడు పుట్టాక ఈ ఆర్నెల్లలోనూ ఏ మూడునాలుగుసార్లో

కలిసి బయటికెళ్ళారేమో! మరీ యాంత్రికమైపోతోంది బతుకు.... ఈ యాంత్రికమైన బతుకులోంచి కాస్సేపైనా బయటపడే అవకాశం లేదు. తనకి సినిమాలక్కర్లేదు.... చీరలక్కర్లేదు.... కాని వారానికి ఓ రెండు సార్లు అలా టాంక్‌బండ్ మీదకో, పబ్లిక్ గార్డెన్స్‌కో వెళ్ళివస్తే మనస్సెంత హాయిగా ఉంటుంది! అదేం ఖర్మో అంత చిన్న కోరిక్కూడా తీరడం గగన కుసుమమై పోతోంది!

ఎంత యాంత్రికమైన బతుకులో కూడా తనకి జీవాన్నిచ్చేది రచనా వ్యాసంగం కాని ఈ మధ్య రాయడం కాదుకదా పుస్తకాలు చదవడం కూడా అవడంలేదు. పగలల్లా తీరికలేని పని! పోనీ రాత్రి అందరూ నిద్రపోయాక రాసుకొందామన్నా ఇన్స్పిరేషన్ ఏదీ? మెదడు మొద్దుబారినట్లుంటుంది. రేపు చెయ్యవలసిన టిఫిన్లూ, ఉతకవలసిన బట్టలూ వీటిగురించే ఆలోచనలు!

'ట్రింగ్' కాలింగ్‌బెల్ మోగగానే గబగబా మూకుడు దించేసి దానిమీద మూత పెట్టి పరిగెత్తింది.

"అమ్మయ్య! వచ్చేశారా? ఇవాళ నేను రెడీగా ఉన్నాను. పదినిమిషాల్లో టిఫిన్, కాఫీ తెచ్చేస్తాను.... మీదే ఆలస్యం" ఉత్సాహంగా వంటింట్లోకి నడిచి ప్లేట్లో ఉప్మా తెచ్చి అందించింది.

"అదేం.... అలా ఉన్నారేం? ఇవాళ ఎక్కడికీ వెళ్ళాలని లేదా?" నిరాశగా అడిగింది భర్తమొహం చూస్తూ.

"మీ నాన్నగారి దగ్గర్నుంచి ఉత్తరమొచ్చింది" జేబులోంచి కవరు తీసి అందించాడు. ఆతృతగా కవరందుకొంది. చదువుతున్నకొద్దీ మొహంలో నీలినీడలు కమ్ముకున్నాయి.

"ఇదేంటండీ వీడు మళ్ళా ఇలా చేశాడు?" దిగులుగా అంది.

"తిరిగొచ్చేక మీ తమ్ముడినే అడుగు" ఉప్మా తినడాని కుపక్రమిస్తూ అన్నాడు.

భారంగా వంటింట్లోకి నడిచింది పద్మ.

"ఈ సరికి అక్కడ అన్నయ్య, నాన్నగారు ఎంత హడావిడి పడుతుంటారో! అమ్మ ఎంత ఏడుస్తుందో!" కంట్లో నిలిచిన నీళ్ళని తుడిచేసుకొంది.

వెనకనించి వొచ్చి భుజంమీద చెయ్యి వేశాడు రాజారావ్.

"వర్రీ అవకు పద్మా.... ఇది నీకు కొత్త కాదుగా....తొందర్లోనే వచ్చేస్తాడ్లే" భార్యవైపు జాలిగా చూస్తూ ఓదార్పుగా అన్నాడు.

"నాన్నగారూ, అన్నయ్యా వెతకడానికి ఊరుకెళ్ళిపోయి ఉంటారు. పాపం అమ్మ ఒక్కతే ఎం దిగులుపడుతోందో?"

"పోనీ వెళ్ళి కొన్నాళ్ళు మీ అమ్మదగ్గరుంటావేమిటి? మీ తమ్ముడు తిరిగొచ్చేదాక?" ఓదార్పుగా అన్నాడు.

పద్మకళ్ళు మెరిశాయి ఒక్కక్షణం.

"పాపం మీకు వంటా....అదీ ఇబ్బందేమో" సందేహంగా చూస్తూ అంది.

"ఫర్వాలేదులే.... నే నేదోలా సర్దుకొంటానుగా."

పద్మ మనస్సులో అంతవరకు ఉన్న దిగులూ చిరాకూ మాయమై తేలికైంది. తమ్ముడు తిరిగివచ్చేదాక తను అక్క

డుంటే బుజ్జిగాడితో ఆడుకొంటూ అమ్మ దిగులు మర్చిపోతుంది. తనక్కూడా బోల్డంత సమయం.... బుర్రలో సుళ్ళు తిరుగుతున్న ఎన్నో కథావస్తువులకి ఓ రూపం ఇయ్యొచ్చు! .తేలిగ్గా నిట్టూర్చింది.

ఆర్నెల్ల తర్వాత ఆరోజు రాత్రి మళ్లా కాగితం కలం ముందేసుకు కూర్చోంది.... గంటలు గంటలు గడిచి పోతున్నాయి.... ఆ రచనా ప్రవాహంలో పడి.....ఇప్పటి యాంత్రిక జీవనంలోని సమస్యలూ... రేపటి గురించిన ఆలోచనలూ.... అన్నీ కొట్టుకుపోయాయి.

* * *

హోటల్ గదికి సరిగ్గా మధ్యలో వేలాడుతుందా తాడు!

గది మధ్యలో ఫానునించి వేలాద దీసిన ఆ తాడుకి చివర ఓ బారుముడి వేసిఉంది.

ఇటూ....అటూ ఊగుతోందా తాడు! సీలింగుకి దగ్గరగా ఉన్న బల్బుకాంతి తాడుమీదా, తాడు చివర్న వున్న ముడి మీదా పడి పదిరెట్లున్న నీడకూడా ఊగుతోంది నేలమీద అటూ....ఇటూ.

ఆ తాడుకిందుగా కుర్చీవేసి ఉంది. అందులో మోకాళ్ళలో తలదూర్చి కూర్చొని ఉన్నాడు రవి.

అప్పటికి నాలుగుసార్లు ఆ కుర్చీమీదకి ఎక్కిదిగాడు!

సరిగ్గా నిన్నటితో జేబులో ఆఖరి రూపాయి ఖర్చయిపోయింది....ఈ తాడు కొనడంతో! ఈ ఇరవైరోజులూ తాను తిరగని ప్రదేశం లేదు.... అనుభవించని సుఖంలేదు.... స్వేచ్ఛగా ఆకాశంలో ఎగిరే పక్షిలా ఎగిరాడు....నీళ్ళలో ఈదే చేపలా తుళ్ళి తుళ్ళి పడ్డాడు. బస్సుల్లో కిటికీపక్కన కూర్చొని రోడ్డుమీద హడావిడిగా పరిగెత్తే మనుష్యుల్ని చూసి నవ్వుకొన్నాడు. గానుగను తిప్పే ఎద్దుని చూసి జాలిపడతారు మనుష్యులు...కాని తమ బతుకే తమంత తామే గానుగెద్దు బతుకులా చేసేసుకొంటారు .... ఎంత చిత్రమైనవాడీమనిషి! ఈ సంసారం.... ప్రేమలూ.... ద్వేషాలూ ఇవన్నీ ఏర్పరుచుకోకపోతేనేం? అవన్నీ ఏర్పరుచుకోడ మెందుకు?.... క్షణక్షణం దుఃఖపడ్డం ఎందుకు? లాభంలేదు.....మరొక్క రోజుకూడా తానీ ప్రపంచంలో ఇమడలేడు.... రవికి క్రిందటిసారి తన్ను కూర్చోపెట్టి నాన్న బోధించిన వేదాంతం .... చెప్పిన శ్లోకం గుర్తొచ్చాయి.

సుఖదుఃఖే సమేకృత్వా లాభలాభౌ
జయా జయా
తతా యుద్ధా యయుజ్యస్వ నైవం
పాప మవాప్యసి॥

సుఖము దుఃఖము, గెలుపు వోటమి.
లాభనష్టము లొక్కటిగ గని
యుద్ధమునకున్ సిద్ధపడినచో
పాప మెన్నడు పొందవు.

యుద్ధమంటే ప్రతిమనిషికీ ఎదురయ్యే సమస్యలను ఎదురించి పోరాడడమట! పాపమంటే తాను చేయవలసిన పనిని చెయ్యలేకపోతున్నానేమో అన్న క్లేశమట!

సిల్లీ!.... అసలు యుద్ధమెందుకు చెయ్యాలి? బంధాలుంటేనే యుద్ధం! అసలీ

బంధాలే లేకపోతే? క్షణక్షణం యుద్ధం చేస్తూ బతక్కపోతేనేం?

రవి మళ్ళా కుర్చీ ఎక్కాడు....

* * *

పదిహేను రోజుల్నుంచి పట్టిన ముసురు వదిలిపోయింది .... సూర్యుడి లేత కిరణాల్లో పచ్చటిచెట్లు మరింత పచ్చగా మెరుస్తున్నాయి ....ఆ ఇంట్లో వాతావరణం ప్రశాంతంగా ఉంది. పెరటి వాకిట్లో పడక్కుర్చీలో పడుకొని చేత్తో భగవద్గీత పట్టుకొని ఇంటికి తిరిగొచ్చిన కొడుక్కి రాత్రికి ఇయ్యవలసిన బోధల గురించి తీవ్రంగా ఆలోచిస్తున్నారు రఘురామయ్యగారు.

వంటింట్లో హడావిడిగా కొడుక్కిష్టమైన వంటలు చేయడంలో మునిగిపోయి ఉంది పార్వతమ్మ.

డాబామీద కూర్చొని ఈ పదిహేను రోజులూ వేసిన స్కెచ్‌లని చూసి మురిసిపోతున్నాడు శేఖరం.

ముందుగదిలో చాపమీద చుట్టూ కాగితాలు పరుచుకు కూర్చొని ఏ పత్రికకి ఏ కథ పంపితే బాగుంటుందో లిస్టు తయారు చేసుకొంటోంది పద్మ.

అందరి మొహాల్లోను ఏదో తృప్తి!

పడగ్గదిలో టేబుల్‌మీద తలవాల్చుకు కూర్చొన్న రవిమాత్రం విసుగ్గా పదోసారి అనుకొన్నాడు.

"ఓడిపోయాను.... దారుణంగా ఓడిపోయాను."

కిటికీలోంచి వీచిన గాలికి టేబుల్‌మీది కాగితాలు రెపరెపలాడాయి. ఒక కాగితం ఎగిరి కిందపడింది.

"అక్క మళ్ళీ ఏదో కథ వ్రాసింది కాబోలు!" కాగితం తీసి బల్లమీద పెట్టబోతూ పైన రాసిఉన్న వాక్యం చూసి ఆగిపోయాడు. అతడి కళ్ళు అక్షరాల వెంట గబగబా పరిగెత్తాయి.

"ఎక్కడికని పారిపోతావు తమ్ముడూ?"

ఈ యాంత్రికమైన జీవితంలోంచి... ఈ సమస్యల్లోంచి పారిపోవడానికి నీకు రైలుబండితప్ప మరేం దొరకలేదా?

"చదవడానికో మంచి పుస్తకం...వినడానికో చక్కటిపాట.... రాయడానికో కథ.... వేసుకొందికో బొమ్మ.... ప్రేమించడానికో మనిషి.... ఏవీ దొరకలేదా?"

"అయినా ఎంత పిచ్చోడివి!!

"జీవితమే ఒక రైలుబండి కదా మళ్ళా వేరే రైలుబండెందుకు?

"నీ మజిలీ చేరడానికి ఏదో ఒక బండీ ఎంచుకోక తప్పదు....

"నిర్ణయించిన పట్టాలమీద ఆ బండీ నడవక తప్పదు....

"అటువంటప్పుడు పట్టాలు తప్పించాలని ఎందుకా తాపత్రయం?

"ఆ రైలుబండి కదుల్తున్నంతకాలం రైలుపెట్టెలో ఆ నాలుగుగోడల మధ్యనే నువ్వు కూర్చోవాలి! మహా అయితే



బండి ఆగినప్పుడు మరో పెట్టెలోకి మారగలవు.... అంతే।

"మళ్ళా ఆ పెట్టెకి నాలుగ్గోడలుంటాయి.... ఎన్ని పెట్టెలు మారినా నువ్వు కూర్చోవలసింది ఆ నాలుగ్గోడల మధ్యనే।

"అంత మాత్రాన రైలుబండి మీద కోపమొచ్చి కిటికిలోంచి దూకేస్తే నీ కాళ్ళే విరుగుతాయి....

"ఒద్దు తమ్ముడూ.... పారిపోకు.... పారిపోవాలనిపించినా రైలెక్కకు.... ఉరితాడు వెతుక్కోకు....

"నువ్వు పారిపోగల్గిన ప్రదేశాలు నీ చుట్టూనే ఎన్నో ఉంటాయి....

"వెతుక్కో.... వెతుక్కో.... నీ జీవితమంతా ఆ అన్వేషణలో ఖర్చయినా వెతుక్కో....

"అంతేకాని జీవితాన్నించి పారిపోకు..।

——